# ఒక అమ్మ కథ



శ్యామల

స్టవ్ మీద గిన్నెలో నీళ్ళు మరుగుతున్నాయి. అరవింద తదేకంగా ఆ నీటినీ ఆవిర్లనూ చూస్తూ నిల్చున్నది. ఆమె హృదయమూ అలాగే ఆవిర్లు చిమ్ముతూ, వేడిగా మండిపోతున్నది !

"అరవిందా !" మూర్తి పిలుపు వినిపించినా జవాబిద్దామని తోచలేదు అరవిందకి.

"అరవిందా !" మరోమారు గట్టిగా పిలిచాడు మూర్తి.

వెనక్కి తిరిగి, పెదవులపైన చూపుడువేలు ఉంచుకొని చిన్నగా అంది – "ఉష్, నెమ్మదిగా మాట్లాడండి. దీప నిద్రపోతున్నది...లేస్తుందేమో !"

క్షణకాలం మాట పెగల్లేదు మూర్తికి.

"ఏమిటా మాటలు ? మతిపోయిందా ?" చిరాగ్గా అన్నాడు. దుఃఖాన్ని కప్పిపుచ్చుకోవటానికి తెచ్చిపెట్టుకున్న చిరాకు అది.

ఆ మాటలతో తెలివితెచ్చుకున్నట్లయిన్ అరవింద వేడినీళ్ళు ఫిల్టర్‌లో పోసి స్టవ్‌పైన పాలు పెట్టింది పాలు కాగాక చల్లార్చి, పంచదార కలిపి ముందుగదిలోకి తీసుకువస్తుంటే ఎదురొచ్చింది చెల్లెలు ఇందిర.

"ఇందూ, దీప లేచి ముఖం కడుక్కుందా ? పాలు ఇద్దామని –" అంది అరవింద.

"అక్కా !" ఆశ్చర్యంగా అంది ఇందిర. "ఇంకా భ్రమలోనే ఉన్నావా !?"

చేతిలోని గ్లాసు జారి పడిపోయింది..

నిలబడిన చోటే కూలబడిన అరవిందకి నేలపైన ఒలికిన తెల్లని పాలలో ఏవేవో దృశ్యాలు కనబడసాగాయి......

* * *

బి. ఎ., బి. ఇడి. చదివి టీచర్ జాబ్‌లో ప్రవేశించాక తనకు సంబంధాలు చూడసాగాడు అన్న శంకరం. తనకు నచ్చక కొన్ని, తను నచ్చక కొన్ని సంబంధాలు తిరిగి పోతూండగానే తనకు పాతికేళ్ళు దాటాయి.

తనకు మొదటినించి పెళ్ళిపట్ల ఆసక్తికాని, శారీరక సౌఖ్యంపట్ల కోరిక కాని అంతగా లేవనే చెప్పాలి. నలుగురు పిల్లలను కన్నాక, ఇరవైనాలుగవ ఏట సంసారాన్ని వదిలేసి ఒక ఆశ్రమంలో చేరిపోయిన విచిత్ర వ్యక్తి అమ్మ. పూర్తిగా కాకపోయినా కొన్నయినా అమ్మపోలికలు తనలో ఉన్నాయేమో !

కాని తనకు, అమ్మకు ముఖ్యమైన తేడా ఒకటి ఉంది. తనకు చిన్నపిల్ల లంటే ఎంతో ముద్దు. అమ్మకు అంతటి ఆపేక్ష లేదేమో-ఉంటే నలుగురు చిన్న పిల్లలను వదిలి వెళ్ళిపోగలిగేదా ?

30 ఏళ్ళు దగ్గరపడుతున్న చెల్లెలికి ఇక పెళ్ళే కాదేమోనని దిగులుపడేవాడు అన్న. దిగులే లేనట్లు మామూలుగా కనబడే అరవిందని చూసి ఆశ్చర్య పోయేవాడు. ఈమెకి కోరికలే లేవా ? సంబంధాలు చూస్తుంటే వద్దనదు... కుదరకపోతే బాధపడదు...ఇదేమిటి?!

అరవిందకి ఉన్న దిగులల్లా ఒక్కటే తనకు పెళ్ళి అవకపోతే పిల్లలు పుట్టరు కదా – తనది అనబడే పసిపాప తన రక్త మాంసాలు చీల్చుకువచ్చిన పాప లేకపోతే బ్రతుకు ఎంత నిస్సారం! అరవిందకు చిన్నపిల్లలంటే ఎంతో యిష్టం. చిన్నప్పటినించి చుట్టుపక్కల ఇళ్ళలోని పిల్లలని చేరదీను ముద్దుజేసేది. పిల్లలతో కాలం గడిచిపోయే ఉద్యోగం అనే టీచరుగా చేరింది. పిల్లల ముద్దు మాటలు వింటూ వాళ్ళ లేతమనసులను విజ్ఞానవంతంగా తీర్చిదిద్దడంలో అరవిందకు ఎనలేని ఆనందం లంభిం చేది. తన ఆప్యాయతకు ప్రతిగా వాళ్ళు ఆప్యాయత అందించినపుడు మురిసి పోయేది. కాని వాళ్ళు ఒక క్లాసు దాటి మరొక క్లాసులోకి వెళ్తూ, క్రమంగా పాత టీచరుని మరిచిపోయేవారు. గుర్తుంచుకున్నా, కేవలం గౌరవంతోనే కాని. నిండుహృదయపు ప్రేమతో కాదు - ఆ ప్రేమ దక్కేది ఆ పిల్లల తల్లి తండ్రులకు; స్కూల్లో టీచరుకి కాదు ? అందుకే తనకో పాప పూర్తిగా తనదే అయిన పాప ... కావాలి !! తను ఉన్నా, లేకున్నా, తనలోనించి వచ్చిన పాప - తన పాప – ఉండాలి.

అరవిందకు మూడుపదులు వెళ్ళిన సంవత్సరమే సంబంధం కుదిరింది. ఎం.ఎస్‌సి., పి.హెచ్‌డి. చదివి తాను కోరుకున్న ఉద్యోగాన్ని ఆర్జించేసరికి

మూర్తికి 31 సంవత్సరాలు వచ్చాయి. తన వయసుకి తగిన విద్యావంతురాలి కొరకు వెతుకుతుంటే అరవింద అన్న అతన్ని కలుసుకొనటం జరిగింది. పెళ్ళయినాక ఆ ఊర్లోనే ఉన్న భర్త యింటికి వెళ్ళిపోయింది అరవింద.

పెళ్ళయిన రెండేళ్ళకు భర్తతో కలిసి డాక్టరు వద్దకు వెళ్ళింది అరవింద, ఇంకా పిల్లలు కలగలేదని. అన్ని పరీక్షలు చేశక డాక్టరు వారిద్దరిలో ఏ లోపమూ లేదని, తాము చేయగలిగేది ఏమీ లేదనీ అన్నారు.

సంవత్సరాలు గడుస్తున్నా, పిల్లలు కలగకపోవటంవలన అరవిందలో అసంతృప్తి పేరుకుపోతున్నది. ఎంతో నెమ్మదిగా ఉండే మనిషి, ఇప్పుడు ప్రతిదానికీ చిరాకుపడ్తున్నది. ఎంతో నిబ్బరంగా ఉండే మనిషికి ఇప్పుడు ప్రతి చిన్నవిషయానికీ కన్నీరు ఉబికి వస్తున్నది. స్కూల్లో పిల్లలను చూస్తున్నకొద్దీ, 'వీళ్ళలో ఏ ఒక్కరికయినా నేను అమ్మని కాకూడదా ?' అనే భావన రంపపుకోత కోస్తున్నది. నిద్రలేవటం, వంటచేసుకోవటం, స్కూల్లో పని, తిరిగి వంట, నిద్ర – ఇంతేనా తన జీవితం ? మూర్తికి తనంటే అనురాగమే; తనకు మూర్తిపట్ల ప్రేమే కాని తామిద్దరి నడుమా మమతల వంతెన వేసే బిడ్డలేదు ! తామిద్దరూ కలిసి పెంచుకునేందుకు ఓ పాపలేదు ! భవిష్యత్తు గురించి కలలు కనటానికి – ఇప్పుడు అన్నిరోజులు ఒకలాంటివేగా – భవిష్యత్తే లేదు, అనిపించేది అరవిందకి.

పెళ్ళయిన ఆరేళ్ళకి అరవిందకి ఒకమారు ఏదో అనుమానం...... రోజురోజుకి దృఢపడుతున్న అనుమానం ......డాక్టరుని కలుసుకొని ఆవిడ అనుమానం నిర్ధారణ చేసిననాడు చెప్పలేని ఆనందం ... "చూడండమ్మా, మీకు ఈ వయసులో మొదటి కాన్పు. చాలా జాగ్రత్తగా ఉండాలి. ఈ మందులు శ్రద్ధగా వాడండి. బాగా విశ్రాంతి తీసుకోండి. ప్రతి రెండు వారాలకు వచ్చి పరీక్ష చేయించుకోవాలి. అజాగ్రత్తగా ఉంటే అబార్షన్ అయ్యే ప్రమాదం ఉంది" అంది డాక్టరు.

ఆరోగ్యం పట్ల అరవింద ప్రత్యేక శ్రద్ధ చూపసాగింది. మూర్తికూడా ఆమెను అపురూపంగా చూసుకున్నాడు. జీతం నష్టంపైన శలవు పెట్టేసింది. ఎంత జాగ్రత్తగా ఆరోగ్యం కాపాడుకున్నా, ఒంటికి సీరుపట్టి చాలా బాధ పడింది. రెండు రోజులు విపరీతమైన నొప్పులు పడినాక, ఆపరేషన్ చేసి బిడ్డను బయటకు తీశారు. తెలివి వచ్చాక ఎదురుగా భర్త, అన్న, వదిన అంతా కనిపించారు –

"పాప...పాప..." అయోమయంగా అడిగింది.

"పాప బాగానే ఉందమ్మా." ఆప్యాయంగా చెప్పింది వదిన.

"చూపించవూ ?" నీరసంగా అడిగింది.

"అప్పుడే అంత ఆత్రుతా ?" నవ్వింది వదిన.

"కష్టపడి కన్నది కదమ్మా, ఆత్రుత ఉండదా ?" అంటూ నర్స్ పొత్తిగుడ్డల్లోని పాపని తీసుకువచ్చి చూపించింది.

గుప్పెట్లు బిగించి, కళ్ళు మూసుకొని, గులాబీ రంగులో అతి సుకుమారంగా ఉన్న పాపని చూస్తుంటే మనసంతా ఏదో తెలీని, చెప్పలేని, హాయి ఆవరించింది. హృదయంలోని ఏవో సున్నితమైన తీగలు రమ్యమైన అనుభూతితో కదలగా, అంతవరకూ పడిన శ్రమ అంతా మరపుకు వచ్చింది. వేలుతో నెమ్మదిగా పాప బుగ్గని నిమిరింది. మెత్తగా ఉంది. ఆ చిన్నారి చేతిని తన చేతిలోకి తీసుకొని పెదవుల పైన ఉంచుకుంది. ఒళ్ళు ఝల్లుమన్నట్లే అయింది. నర్స్ పాపని తిరిగి తీసుకు వెళ్ళి ఉయ్యాలలో పడుకోబెట్టింది.

మొదటిసారిగా, పాపని తన ప్రక్కన పడుకోబెట్టుకొని – ఆ పాపనోట్లో స్తనం ఉంచి – అందులోనించి వస్తున్న పాలు పాప కడుపు నింపుతుంటే – తృప్తిగా తాగిన పాప అలాగే కళ్ళుమూసుకొని నిద్రపోతుంటే – "ఈ చిన్నారి నాది..." ఈ బంగారునాది..."అనుకుంటూ ఉంటే మనసులో నిండిన తీయదనానికి సరిపడే ఆనందం మరేదీ ఉండదనుకుంటే —


– ఏనాటి అనుభూతు లివన్నీ ? ఏనాటి ఆలోచనలు ఇవన్నీ ? ఎన్నో ఏళ్ళ క్రితం జరిగినట్లు, ఎన్నో యుగాల క్రితం అయినట్లు, ఎప్పుడో క్రితం జన్మలో అనుభవించినట్లు ఉన్నదేమిటి ?—

"మన జీవితాలను దీప్తివంతం చేసింది నా చిట్టితల్లి" అంటూ పాపను మృదువుగా ముద్దుపెట్టుకున్నాడు మూర్తి ఆసుపత్రిలో మూడవరోజున.

"పాపను 'దీప్తి' అందామా ?" అంది అరవింద.

ముచ్చటగా పెరుగుతున్నది దీప్తి. అందరూ పిలిచే పేరు మాత్రం 'దీప'. అరవిందకు దీపే లోకం. స్కూల్లో ఉద్యోగానికి రాజీనామా ఇచ్చి వేసింది, కూతురిని ఎవరిదగ్గరా వదలలేనంటూ. మూర్తి పట్ల శ్రద్ధకూడా తగ్గిపోయింది. అవునుమరి, సెక్స్‌లో సరదాలేని వ్యక్తి, పిల్లలకోసమే పెళ్ళి అనుకునే వ్యక్తి ఆమె మొదటినించి. చాలాకాలం ఎదురు చూశాక, మనసంతా నిరాశ నిండాక దొరికిన వజ్రం ఆ పాప. మూర్తికీ పాపంటే అంతులేని ఆప్యాయతే ! కాని అతనికి పాపకాక, ఆఫీసు, స్నేహితులు వంటి వ్యాపకాలు ఉన్నాయి. అరవిందకి సర్వమూ పాపే!

రెండవనెలలో ఎవరయినా పలకరిస్తే,




ముత్యాలు ఒలకబోసినట్లే బోసినవ్వులు చిందించే దీప – మూడవనెలలో బోర్లా పడాలని అవస్థపడిన దీప – ఆరవ నెలలో ప్రాకాడటం మొదలుపెట్టి – పదవనెలలో నిలబడటానికి ప్రయత్నిస్తూ, చేతకాక క్రిందపడితే ఏడుస్తూ, నెప్పి తగ్గగానే తిరిగి నిలబడ్తూ — ఏడాదికి తప్పటడుగులు వేసి, మొదటి సారిగా అరవిందని "అమ్మా" అన్న దీప ముద్దుమురిపాలకి తల్లిదండ్రులేకాక, ఇరుగుపొరుగులు కూడా ముచ్చట పడుతుండగా పెద్దదవుతున్నది! ఇంటివద్దనున్న కిండర్‌గార్టన్ స్కూల్లో చేర్పించిననాడు, క్లాసురూము తలుపు వద్ద అమ్మని, నాన్నని వదలలేక దీప బిక్కముఖం పెట్టింది. "వెళ్ళిపొండి, మేము చూసుకుంటాముగా" అని టీచర్లు అరవిందని, ఇతర పేరెంట్స్‌ని పంపించి వేస్తే, అరవింద ఇంటికి వెళ్ళలేక, స్కూలు గేటు వద్దనే నిలబడిపోయింది. "దీప ఏడ్చిందేమో! ఏడుస్తున్నదేమో!" అని దిగులుపడ్తూ మధ్యాహ్నం వరకు అక్కడే ఉంది. గంట అవుతూనే లోపలికి వెళ్ళేసరికి ఎదురు వచ్చింది దీప నవ్వుతూ —

"అమ్మా! టీచర్ మా కందరికి చాక్‌లెట్లు ఇచ్చారు! కొందరు ఏడ్చారు కానినేనసలుఏడవలేదు! బడి భలే బాగుందమ్మా! 'ఎవరికయినా పాటలు వచ్చా' అంది టీచర్. నేను 'బుజ్జిమేక' పాట పాడాను." ఉత్సాహంగా చెప్పింది.

"నా చిట్టితల్లీ!" అంటూ దీపని ఎత్తుకొని హృదయానికి హత్తుకుంది అరవింద ఎన్నో రోజులుగా విడిపోయినట్లు. "నీ కోసం నేను దిగులుపడ్డా

నమ్మా" అంటూ నవ్వింది కళ్ళలో నీళ్ళతో !

ఇరుగు పొరుగు ఇళ్ళలో అందరికీ కూడా దీపంటే ముద్దే. అందరి ఇళ్ళకూ వెళ్ళి ఆరిందాలాగా కబుర్లు చెప్పేది. బిచ్చగాళ్ళను చూస్తే అమితమైన జాలి పడేది. అడిగినవారికి లేదనకుండా చేతిలోనున్న వస్తువు ఇచ్చివేసేది. ఆ యింటికే కాక వీధికే వెలుగు దీప !

ఆ రోజు —

దీపకు అయిదేళ్ళు పూర్తయిన పుట్టిన రోజు.

అంతకు కొన్నాళ్ళ క్రితమే అరవింద పుట్టినరోజయింది. ఆ రోజు అనుకోకుండా అరవిందకు వరుసకు చెల్లెలయిన ఇందిర ఊరినించి వచ్చింది. అంతకు ముందు మూర్తి పుట్టినరోజున అనుకోకుండా అతని ఆప్తమిత్రుడొకడు రావటం తటస్థించింది. దీపకు ప్రొద్దుటే తలంటిపోసి ఉంగరాల జుట్టులో ఎర్ర రిబ్బను కడ్తూ అంది అరవింద.

"ప్రతి పుట్టినరోజుకీ ఎవరో అతిధులు వస్తున్నారు, ఇవ్వాళ ఎవరు వస్తున్నారో ?"

"బంగారు తల్లికోసం దేవుడే దిగి వస్తాడు !" నవ్వుతూ అన్నాడు మూర్తి.

"నిజంగానా, నాన్నా ?" కళ్ళు పెద్దవిచేసి అడిగింది దీప.

దీప ఆశ్చర్యానికి అరవింద, మూర్తి నవ్వారు.

"నాన్నా, దేవుడు ఎట్లా వస్తాడు ? విమానంలోనా ?" మళ్ళీ అడిగింది దీప.

"నాకు తెలీదమ్మా" అలమారాలో నించి రంగుకాగితం కట్టిన ప్యాకెట్ తీస్తూ అన్నాడు మూర్తి "నీ కోసం ఏం తెచ్చానో చూడు !"

ప్యాకెట్ విప్పి చూసుకున్న దీప ముఖం ఆనందంతో విప్పారింది. చక్కని పాపబొమ్మ పెద్దసైజులో అందంగా ఉంది. "ఎంత బావుందో ! అమ్మా, ఈ పాపకి ఏం పేరు పెట్టను?"

"ఆ బాక్స్‌పైనే ఉంది చూడు పేరు !"

"ఎమ్–ఓ–ఎన్–ఏ — మోనా ! అమ్మా, ఈ పాప పేరు మోనా. రోజూ నా ప్రక్కనే పడుకోబెట్టుకుంటాను !" అంతలో ప్రక్కింటి పిల్లలు రావటంతో అంతా కలిసి కొత్త బొమ్మతో ఆడుకోవటంలో నిమగ్నమయినారు.

క్లాసులోని పిల్లలందరికీ ఆ రోజు దీపచేత చాక్‌లెట్స్ ఇప్పించింది అరవింద. టీచర్ చెప్పగానే పిల్లలంతా పాడసాగారు.

"హాపీ బర్త్‌డే టు యూ
హాపీ లాంగ్ లైఫ్ టు యూ
డియర్ దీప్తీ — "

పాట వింటుంటే అరవిందకి గర్వంతో, ఆనందంతో కళ్ళు తడి అయినాయి.



సాయంత్రానికి దీప స్నేహితులందరినీ ఇంటికి పిలవమని ముందే చెప్పింది అరవింద. హాలంతా పిల్లలతో కిటకిటలాడ్తుంటే వాళ్ళందరికీ స్వీట్లు వగైరా ఇచ్చింది. అందంగా, చలాకీగా ఉన్న దీప తారకల మధ్యలోని చంద్రునివలె మెరిసిపోతుంటే అరవింద మురిసిపోయింది. ఆమె మనసులో వెన్నెలే కురిసించి. కాస్సేపు పిల్లలంతా డాన్సులు, పాటలతో గడిపాక బయటకు వచ్చారు. అంతా కలిసి ఆడుకుంటుంటే చిరునవ్వుతో చూస్తూ గుమ్మంలో నిల్చున్నాడు మూర్తి.

ప్లేట్లు వగైరా తీసి హాలు సర్దుతోంది అరవింద.

పైన విమానంపోతున్న శబ్దమయింది.

అంతలోనే దీప స్వరం వినిపించింది — "అమ్మా ! విమానం వస్తోంది ! నా కోసం అందులో దేవుడు వస్తున్నాడేమో !"

తెలియని భయంతో వణికిపోయింది అరవింద. ఒక్కపరుగున వాకిట్లోకి వచ్చింది

"దీపా !" మూర్తి గొంతు ఆదుర్దాగా ఉంది. "రోడ్డుమీదకు వెళ్ళకు !" త్వరగా ఆవరణ దాటి దీపను చేరుకోబోయాడు.

అప్పటికే దీప గేటు నెట్టుకొని రోడ్డు పైకి వెళ్ళింది. దృష్టి అంతా పైనున్న విమానంపైనే ఉంది. "నాన్నా, నాకోసం నిజంగానే దేవుడు వస్తున్నాడా ?" అంటూ, సమాధానం కొరకు ఎదురు చూడకుండానే, ఇంకా ముందుకు పరుగెత్తింది, పైకి చూస్తూ.

ఆ క్షణాన సరిగా ఏమయిందో ఎవరికీ తెలియలేదు. కీచుమంటూ ఓ లారీ ఆగిన శబ్దం, దీప ఎర్రటి ఫ్రాకులోని రంగు ఒళ్ళంతా ప్రాకినట్లు అంతా రక్తమయం. హోరుమనే విమానం శబ్దం దూరమవటం —

* * *

"అరవిందా, ఏమిటలా కూర్చుండిపోయావు ఇంతసేపు ? మృదువుగా పిలిచాడు మూర్తి.

ఒలికిపోయిన పాలను చూస్తున్న అరవింద తలెత్తి భర్తను చూస్తూ "మీరే... మీరే ... దేవుడు వస్తాడని చెప్పి, నా దీపతల్లిని దేవుడి దగ్గరకు పంపేశారు !" కసిగా అంది.

"అంత అన్యాయంగా మాట్లాడకు అరవిందా " విషాదంగా అన్నాడు మూర్తి.

అరవింద చూపు గూట్లోని 'మోనా' పైన పడింది. లేచి ఆ బొమ్మ చేతిలోకి తీసుకొని, పైటచెంగుతో తుడుస్తూ "బొమ్మలన్నీ ఇట్లా దుమ్ముగా ఉంటే దీప ఎలా ఆడుకుంటుంది ? ఇందిరా, కాస్త నీవైనా ఈ బొమ్మలను సర్దిపెట్టకూడదూ ?"

ఇందిర మూర్తివైపు చూసింది 'ఏమిటీ మనిషి ? ఏం చేయటం ?' అన్నట్లు.

'ఓ క్షణాన తెలివి ఉంటుంది. మరో క్షణాన పిచ్చి ధోరణి...కాలమే సాయం చేయాలి' అనుకుంటూ నిస్సహాయంగా చూశాడు మూర్తి

---


పసిపాపలెందరో వనరాశిపాలు

కన్నకడుపుతీపి కడలికేం తెలుసు ?

—తుపాను సహాయనిధికి విరాళ మివ్వండి